కథానిక

# పరిశిష్టం

"సులోచన"

డాబామీద బయట సాయంత్రం వీచే చల్లగాలికై కుర్చీ వేసుకు కూర్చున్నాను పుస్తకం చదువుతూ. తోటలోని పూలవాసన, నదినించి వీచే చల్లని గాలీ, చదివే పుస్తకంలోని సంఘటనల యింటరెస్టూ, నాలో నూతనోత్సాహాన్ని ప్రసాదిస్తున్నాయి.

రాధిగాడు పిప్పిగంతు లేసుకొంటూ వొచ్చాడు. వాడు అంత త్వరగా రావటంలో ఏదో కారణం వుంది. ఏదో చెప్పాలని వొచ్చివుంటాడు. కాని అనుకున్నంత తొందరలో చెప్పలేడు. వొచ్చి నా కాళ్ళను చుట్టేసుకున్నాడు. చదువుతోన్న పుస్తకం కిందపడింది కూడా గమనించకుండా వాణ్ణి వొళ్ళోకి ఎత్తుకుని "ఏమిటి విశేషం?" అన్నాను.

సన్నగా నవ్వాడు. చెప్పలేక పోతున్నాడని గ్రహించాను. నా నా మెడని కౌగిలించుకున్నాడు. నెక్‌లెస్‌లోని రాళ్ల తళతళల్ని చూస్తో,

"తెపితే! ఏమిత్తావు" అన్నాడు వచ్చీరాని మాటలతో.

వాడి చెవులు పట్టుకొని ముద్దు పెట్టుకొని "ఇంకో ముద్దు యిస్తాను" అన్నాను

"మామయ్యొత్తాడు!" అని నా ముఖంలోకి చూశాడు, ఎలా సంతోషపడతానో కనిపెట్టాలని కాబోలు.

"ఏ మామయ్యరా?" అన్నాను.

వాడి బుల్లిమూతి మరీ బుల్లిమూతి అయింది. నేను ఆశే సంతోషించపోగా తిరిగి ప్రశ్నించటం వాడికి ఆముదం మింగినట్లయింది. వాడికి మామయ్యయితే తెలుసు. కానీ, ఫలానా వూరని తెలీదు. ఆ తెలీకపోటం వాడి తప్పుకాదు.

ఇంతలో మామయ్యే అక్కడికి వొచ్చాడు "అదుగో!" అని ఒక్క కేక పెట్టాడు.

నేను లేచి నిలుచుని, "ఎప్పుడొచ్చావు మామయ్యా!" అన్నాను.

"అయిదు నిముషాలయింది." ఎందుకనో ఆయన కంఠంలో మునుపటి ఉత్సుకత చలాకీతనం లేనట్టు గోచరించింది.

రాధిగాడు తనపని - అయిపోయినట్టు అక్కడినించి వెళ్ళాడు.

"కుర్చీలో కూచో మామయ్యా!" అన్నాను. క్రిందపడ్డ పుస్తకం తీసి పేజీలు తిరగవేస్తూ స్టూలుమీద కూచున్నాను.

మామయ్య ఎందుకువచ్చాడో అర్థం కాలేదు. బంధువులు యిళ్ళకు రావటం కొన్ని సమయాల్లో అర్థం కాదు, తాము వచ్చినపని వాళ్లు బయట పెట్టిందాకా. మామయ్య వూరికినే రాడు. ఏదో పనితోనే వస్తాడు.

"సరళవాళ్లు బాగున్నారా?" అన్నాను పుస్తకంలోంచి ముఖం ఎత్తకుండానే.

ఎంతసేపటికీ మాట్లాడక పోయేప్పటికి తల పైకెత్తి చూశాను. మామయ్య తలవొంచుకుని వున్నాడు. అక్కజపడ్డాను.

"ఏమిటి మామయ్యా. అలా వున్నావు" అన్నాను సగం ఆదుర్దాగా, సగం అయోమయంగా.

సగద్గికంగా మామయ్య అన్నాడు. "ఏమి చెప్పను తల్లీ. దానిమూలంగానే ఈ బాధంతా!" తరువాత చెప్పలేని స్థితిలో ఒదిలేసినట్లు కనపడుతున్నది.

సరళ భర్త చచ్చిపోయాడు. నాకు తెలుసు. నెలయింది. సరళ చిన్నది. నా వయస్సేదానిది కూడా. దానికి పెళ్ళయి రెండు సంవత్సరాలయింది. నాకింకా కాలేదు. అంతే భేదం. చదువులోకూడా ఇద్దరం ఇంటర్ చదువుతూ మానేశాం. అది పెళ్ళయిన కారణంగా. నేను ఏ కారణం లేకండానూ. భర్త చనిపోతే రెండో

పెళ్ళి చేసేయొచ్చు. నిండా పద్ధెనిమిదేళ్లుకూడా రాని యువతి గనుక.

"ఏమంటుంది, మామయ్యా!" అన్నాను.

ఆయన కంట తడిపెట్టుకోవటం కూడా బాగా కనపడుతున్నది. నాకు జాలేసింది. ఒక్కతే కూతురు. మొట్టమొదట్నుంచీ యేది చేసినా కూతురుకోసమే అన్నట్టు వ్యవహరించాడు. పెళ్ళి కూడా కూతురు యిష్టంతోటే చేశాడు.

"ఏమంటుందమ్మా! ఏం మాట్లాడదు. అలా ఓ గదిలో రేయింపగలూ కూచుంటుంది. పలకరిస్తే పలకదూ, వులకదూ! ఒక్కగా నొక్క కూతురు. చిన్నప్పట్నుంచీ ఎంతో గారాబంగా పెంచుకొచ్చాం. చివరకి...." మామయ్య కంఠం జీరపోయింది.

కొంచెంసేపున్న తరువాత మళ్లా అన్నాడు,

"నేను నిన్ను తీసుకెళ్దామని వొచ్చాను. నువ్వంటే దానికెంతో యిష్టం. చిన్నప్పటి నుంచీ స్నేహితులు. నువ్వన్నా కొస్త దానికి నయాన చెప్పిచూడు. ఒకదారికి తీసుకురా."

"రెండో పెళ్ళిచేయకూడదా, మామయ్యా!" అన్నాను, కూతురికి ద్వితీయ వివాహం చేయటానికి భయపడుతున్నాడేమో మామయ్య అన్న వుద్దేశంతో.

"దానికేం తల్లీ చేయొచ్చు. అంతవరకూ దేనికి. చేస్తానన్నాను. ఈ సంఘం నీతి, కట్టుబాట్లూ, నన్నేం అడ్డుపెట్టవు. నాకు కావలసింది కూతురు సుఖంగా వుండటమే. అందుకోసం నేను సంఘాన్ని ధిక్కరిస్తాను. పునర్వివాహం చేస్తాను. చివరికి నాయింటికి భోజనానికి రాకపోయినప్పటికీ, బంధువులు సమ్మతించనప్పటికీ నేనుభయపడి మానుకొనేది లేదు". కూతురు సుఖంకోరి ఆయనచేసే త్యాగం, పట్టుదలా చూస్తే, ఇటువంటి తండ్రులుంటే కూతుళ్లకేం కొరవ? అనిపించింది. ఇంకా కూతురు మూలంగామామయ్య బాధ ఎక్కడ పడుతున్నాడో, నేను సరళని ఎక్కడ దోవలోకి తీసుకురావాలో అవగాహన కాలేదు.

"శుభ్రంగా ఆపని చేసేయ్యకపోయావా?" అన్నాను. అందుకు ఆయన చెప్పిన సమాధానం యిది.

"నిజమే తల్లీ! ఈవుద్దేశ్యం నాలో పొంతుకుపోయి యిందు మూలంగానైనా దాని జీవితం ఒక దారిన పడుతుందని మీ అత్తా నేనూ ఆలోచించి, దాన్ని అడిగాము. అది ఏమీ జవాబు చెప్పటం లేదు. ఒకసారి గాబోలు, 'పెళ్ళీ వొద్దు పెటాకులూ వొద్దు. నన్నిలా చావనివ్వండి' అని అన్నది" అని బావురుమన్నాడు మామయ్య.

సరళమీద నాకు కోపం వేసింది. ఎందుకు పాపం కన్న తలిదండ్రుల్ని కష్టపెట్టటం అనవసరంగా.

"దాని ప్రవర్తన మాకేమీ అర్థం కావటం లేదు. అంతకంతకూ అధ్వాన్నంగా వున్నది. చిక్కి సగమైపోయింది. దాన్ని చూస్తూంటే మాకడుపు తరుక్కుపోతున్నది. ఆ గదిలో కూచుంటుంది. ఎన్నడూ బయటికిరాదు. సరిగ్గా అన్నం తినదు. విస్తరి ముందు కూచుని పిచ్చిచూపులు చూస్తుంది. మాకు భయమేస్తున్నది. ఒకనాడు డాక్టరుకు చూపించాము. 'రోగం యేమీ కనపడటం లేదు. అమ్మాయి మనస్సును తనకు తాను విపరీతమైన ఆలోచనల్ని కలిగించుకొని చెడగొట్టుకుంటున్నది. గతాన్ని నెమరుకు తెచ్చుకుని కుమిలిపోతున్నది' అని చెప్పాడు. ఇదే మేము ఎన్నోవిధాల చెప్పి చూశాం. అది ఆచరించకపోగా ఆలకించినట్టుగూడా కనపళ్లేదు" మామయ్య ఈ మాటలు అనేటప్పుడు ఆవేశపడుతున్నాడు. ఆయన పలికే ప్రతిమాటలోనూ తన కూతురు చెడిపోయిందన్న బాధా, దాన్ని సక్రమ మార్గంలోకి పెట్టటానికిపడే ఆదుర్దా వ్యక్తమౌతున్నవి.

"నువ్వు వొచ్చి ఒక వారంరోజులు మా యింటిదగ్గర వుండిపో అమ్మా! దాన్ని సన్మార్గంలోకి తేవటానికి నీ కృషికూడా అవసరం. దాని మూలానే మీ అత్త బెంగపెట్టుకుని వేళకు సరిగ్గా అన్నంకూడా తినడంలేదు."

"సరే లే. మామయ్యా! అట్లాగే వొస్తాలే! నీకు అనుగుకూతురు కావటమే కాదు నాకు దగ్గరి స్నేహితురాలు కూడా" అని అన్నాను.

చీకటి పడింది. అమ్మ లైటు వెలిగించేందుకు పైకి వొచ్చింది.

"అమ్మాయి వొస్తానంది. రేపు ప్రొద్దున బండికి తీసుకవెళతాను" అని అన్నాడు మామయ్య అమ్మతో.

"సరే లే. సరళ అలా తయ్యారవటానికి కారణం యేమిటి?" అన్నది అమ్మ.

రామాయణమంతా సమగ్రంగా విని రాముడికి సీత యేమవుతుందని అన్నట్లు అనిపించింది మామయ్యకి.

"అదే తేలటంలేదు" అన్నాడు మామయ్య.

"బహుశా భర్తమీదవున్న నిర్మల ప్రేమ, ఆయన చావటంతో ఈ రూపం ధరించి భయంకరమైందేమో" అని నేనన్నాను.

అందుకు మామయ్య అన్నాడు:

"అయితేమటుకు అమ్మాయీ! మరీ అంత విపరీతమా! ఎంత భర్తమీద ప్రేమవుంటే మటుకు చచ్చింతరువాత మళ్ళా తిరిగొస్తాడటే, ఎంత పిచ్చిగా సంచరించి, ఆలోచించి దుఃఖ స్తే మాత్రం." ప్రేమలో నమ్మకం లేదు మామయ్యకి. ఇప్పటి భార్యాభర్తల మధ్య వుండేది ప్రేమకాదు కామం. దాన్నెవళ్లు గౌరవంగా 'ప్రేమ' అని వ్యవహరిస్తారు? అన్న అభిప్రాయాలు గలవాళ్ళల్లో మామయ్య ఒకడు.

"నీకు తెలీదు లే మామయ్యా! కొంతమంది ఎక్కువగా ప్రేమిస్తారు. ఆ ప్రేమకు విఘాతం కలిగితే యిలాగ అవుతారు" అని నేనన్నాను, మామయ్యలో ఈ అభిప్రాయాన్ని దూర్చాలని.

కాని ఆయనకు యిది నచ్చలేదు.

"అయితే దేనివల్ల- సరళ ఆవిధంగా అయిందని నీ అభిప్రాయం?" అని నేనన్నాను.

"ఆ విషయాన్నే నేను ఇదమిద్ధంగా తేల్చుకోలేక పోతున్నాను. ఏది యేమైనా నువ్వు చెప్పే ప్రేమ మనుషుల్లో లేదనేదాన్ని నేను నమ్ముతున్నాను" అని అన్నాడు.

"ఎందుకర్రా ఈ అనవసరపుగోష్ఠి. పదండి స్నానాలు చేద్దురుగాని. ప్రొద్దుపోయింది" అని అమ్మ ఆ సంభాషణ త్రుంచివేయటంచేత అంతటితో ఆగిపోయింది.

రాత్రిభోజనాలయింతరువాత తన కూతుర్ని గూర్చి ఇంకా కొన్ని ముఖ్య విషయాలు చెప్పాడు మామయ్య.

ఒకరోజు ప్రొద్దున సరళ బావిలోకి దూకిందట. అంతక్రితం రాత్రినించీ ఆమె స్థితి మీరి పోయిందట. అటూ ఇటూ మేడమీద గంటసేపు లైట్లన్నీ ఆర్పి ఒకటే పచారు చేసిందట. మామయ్య చాటునుండి గమనిస్తూనే వున్నాడట ఎక్కడ మేడమీదనించి క్రింద పడుతుందేమోనని. తెల్లవారి అందరికన్నా ముందర లేచి బావిచుట్టూ నాలుగుసార్లు తిరిగి బావిలో దూకిందట. తల్లి వంటయింట్లోంచి కేకలు పెడుతూ వొచ్చేసరికే దూకిందట. వెంటనే పదిమందినీ పిలిపించి తీయించారట. అదైనా ఎందుకు దూకావనిఅడిగితే, "నేనా? దూకానా? బావిలోనా? ఒట్టిది. సర్వబద్ధం" అని అన్నదట. కాని దెబ్బలేమీ తగల్లేదట. నీళ్ళు కూడా ఎక్కువ పీల్చలేదట.

ప్రొద్దున్న బండికి నేనూ, మామయ్యా వెళ్ళాం. అమ్మ వారంరోజుల్లో రమ్మని అన్నది.

* * *

వారమైంది. రెండోవారం సగం గడిచింది.

"ఇక నేవెళతాను మామయ్యా!" అన్నాను. అన్నానన్న మాటేగాని నాకు వెళ్ళమనసెయ్యలేదు. సరళ స్థితి చూస్తుంటే- నా స్నేహితురాలేనా ఈమె? అన్న ప్రశ్న దుఃఖాన్ని తెప్పిస్తుంది.

అక్కడికి వెళ్ళినరోజునే సరళ గదిలోకి వెళ్ళాను. మంచంమీద బోర్లాపడుకుని కంట తడిపెట్టుకొని దిండును కావిలించుకొని ఆలోచిస్తున్నది. పొడిదగ్గు దగ్గాను. నేనొచ్చినట్టు తెలపటానికి. ఆమెలో చలనం కనపళ్లేదునాకు. దగ్గర కెళ్ళి భుజంమీద తట్టాను.

"నన్ను ముట్టుకోకండి. పొండి అవతలికి. నేను చచ్చిపోదలుచుకున్నాను. నన్నెందుకని చావనీయరు మీరు. నన్ను బ్రతికించి సంతోషపెట్టేకన్న-నన్ను చావనిస్తే నాకెక్కువ సంతోషాన్ని చేకూర్చినవాళ్ళు అవుతారు." ఇంకేమేమో అన్నది. మనిషి పూర్తిగా మారిపోయింది. తైలసంస్కారంలేక జుట్టు చిందరవందరగా వుంది. గుడ్డలు కూడా వారం రోజుల క్రింద తొడిగినవాటిలాగా వున్నవి. కళ్ల చివర్నుంచి చెంపలమీదుగా నీళ్లుకారి దిండుమీద పడుతున్నాయి. ఇంకా నన్ను గుర్తించలేదనుకొన్నాను. భుజం పట్టుకు

వూపుతూ-

"నేను. సులోచనన్ని" అన్నాను.

"సులోచననైతే ఏం! విలోచననైతే ఏం? నన్ను పలకరించకండి! నా దగ్గరకి రాకండి. నన్ను ముట్టుకోకండి. మీరంతా మూర్ఖులు పశువులు" ఇలా నడిచింది ఆరోజు సంభాషణ. ఎంత సేపటికీ నామాట వినిపించుకోదు.

రెండోరోజు సాయంత్రం బాగా చీవాట్లు వేశాను.

"నిన్ను పిచ్చిదానిక్రింద జమకట్టాలో మూర్ఖురాలిక్రింద జమకట్టాలో నాకర్థం కావడంలేదు. అక్కడికి నీ భర్తయందు గొప్ప నిశ్చలప్రేమ వున్నట్టు, ఆప్రేమ గాఢమైనట్టు, అందువల్ల వియోగం భరించలేక నీవిలా తయారైనట్టు ఎవరూ అనుకోవటంలేదు. నీకు ఏ దెయ్యమో భూతమో పట్టిందనుకొంటున్నారు. ఎందుకిలా తయారయ్యావు. భర్తయందు ప్రేమ వుంటే వుండొచ్చు. కాని ఈ విధానంవల్ల ఆ ప్రేమకి సాఫల్యాన్ని చేకూర్చగలవా? చూడు ఎలా చిక్కిపోయావో! నీ శరీరంమీద నీకే అసహ్యమేసినట్లుంది. నీగురించి తలిదండ్రులు ఎంత బాధపడుతున్నారో కొంచెమన్నా ఆలోచించావా? వాళ్లు అన్నాలుమాని నీ క్షేమం కోసం కళ్ళల్లో వొత్తులు వేసుకుంటున్నారు. ఇదేమన్నా బావుందా చెప్పు. కన్న తలిదండ్రుల్ని అలా బాధపెట్టటం? శైశవంనుంచీ నిన్ను ప్రాణపదంగా పెంచుకుంటూ వచ్చారు. నువ్వు కొస్త బాధపడితే ఆ బాధను పదిరెట్లు వాళ్లు పడేవాళ్లు. నీలో సంతోషం లోపిస్తే వాళ్లలో లోపించేది."

"అవును కాని నువ్వేం చెపుతున్నావో దాన్ని ఆలోచించ లేదనుకున్నావా? ఆలోచించాను. కాని నా స్వాధీనం తప్పిపోతున్నది. ఎక్కడ చూచినా వారే కనపడతారు. ఒక్కొక్కప్పుడు నరకంలో యమబాధలు పడుతున్నట్టు, ఆ బాధలు అనుభవిస్తూ "సరళా!" అని పిలిచినట్లు కలలొచ్చేవి. ఇంకొప్పుడు స్వర్గలోకంలో దివ్యసౌఖ్యాన్ని అనుభవిస్తూ నన్ను మరచినట్లు కలలొచ్చేవి. కళ్లు తెరచినా మూసినా వారే కనపడతారు. ఏంచేసేది సులోచనా! చెప్పు. చమ్మని రెండు చేతులూ బార్లగా సాచి నవ్వినట్టు కనపడేవారు. మళ్ళా కొంచెం సేపటికి రాకపోయినందుకు యేడుస్తున్నట్టు అగపడేవారు. పోలేనందుకు నేనెంతో బాధపడేదాన్ని" అని అన్నది సరళ.

"ప్రయత్న పూర్వకంగా భర్తని మరచిపోవాలి. నీకన్నా అధికంగా ప్రేమించినవాళ్ళే తమ భర్తల్ని మరచిపోయినారు. ఈ విషయంలో నువ్విలా ఎందుకయ్యావో నా కర్థం కావటంలేదు. పిచ్చి పిచ్చి ఆలోచనలుచేసి, కలలుకని మనస్సుని చీకాకుపర్చుకోవడంలోనే వుంది ఈ దౌర్బల్యం. ఎందుకు మాటిమాటికీ వెధవ ఆలోచనల్ని కల్పించుకోవడం. నీకు పూర్తిగా విశ్రాంతి అవసరం. నా మాట విని ఏ ప్రదేశానికో విశ్రాంతి కోసం పోతే మంచిది. అక్కడైనా మనస్సుకు శాంతిచిక్కుతుందేమో! డాక్టరుగూడా ఆదేచెపుతున్నాడు. మామయ్య కూడా ఒప్పుకున్నాడు" అన్నాను.

సరళలో మళ్ళా యేదో ఆవేశం ముంచుకొచ్చింది. మనిషి తబ్బిబైనట్లు కనబడుతున్నది.

"లాభంలేదు ఎక్కడికెళ్ళినా నా దృష్టి మారదు. కొత్త ప్రదేశాలు, మంచిగాలి, పరిస్థితులు, మనుషులు నా మనస్సును మార్చలేవు. ఏనాడో నామనస్సు నాభర్తకి అంకితమయిపోయింది. మీరు ఎన్నిచెప్పినా నాతలకెక్కవు. ఎక్కించలేరు. అదుగో-వారు కనబడుతున్నారు. నువ్వీమాటలు చెబుతూంటే వారి ముఖం ఎలాగుందో చూడు. ఎంత విచారాన్ని పొందుతూందో చూడు. చూడు! వారి ముఖంకేసి-" అని యేమేమో అన్నది, సరళ.

ఇటువంటి సంఘర్షణలు పదిహేను రోజులలోపల ఎన్నిసార్లో జరిగాయి. కొంచెంసేపు మాటలవల్ల దారి కొచ్చినట్టు కనపడేది. "నేను రెండోపెళ్ళి చేసుకోవటం మంచిదంటావా?" అన్నరోజులుకూడా వున్నాయి. అప్పుడు నేనూ మామయ్యా ఎంతో సంతోషపడేవాళ్ళం. కాని కొంచెంసేపటికి, "ఏమన్నానూ! రెండోపెళ్ళి చేసుకోవాలంటున్నానా! నేనా. ఒట్టిది. మీరే అన్నారు. అనేట్టు చేశారు. అనిపించారు. ఏమన్నా, చెప్పండి. నేను చేసుకోనేదిలేదు. వారికి నాజీవితంలో ద్రోహం తలపెట్టను. నేనే గనక పెళ్ళి చేసుకొంటే వారి మనస్సు అమితంగా

బాధపడుతుంది" అని అనేది. మళ్ళా మా వద నాలు నిరాశాపూరితాలయేవి. చిగిరించిన ఆశలు కరిగిపోయేవి.

ఇక ఆమెతో లాభం లేదనుకొన్నాను. ఆమె మనస్సును మార్చడం మానవులకు తరం కాదని తేల్చుకున్న రోజున మామయ్యతో అన్నాను,

"ఇక నేను వెళ్ళివస్తా" అని.

అయినా నాకు వెళ్ళ బుద్ధి పుట్టలేదు. మామయ్య నేను వెళ్ళటాన్ని గూర్చి యేమీ చెప్పలేదు.

ఇంకా నాలుగురోజులున్నాను. ఈ నాలుగు రోజుల్లో ప్రతిరోజూ సరళకు, ఆమెను గురించి తలిదండ్రుల అవస్థా, విచారమూ, వూళ్ళోవాళ్ళు అనుకొంటున్న అపోహలూ, డాక్టర్ల అభిప్రాయాలూ, ముందుముందు ఏయే పనులు చేస్తే జీవితంలో చక్కని భవిష్యత్తు వుద్భవించేదీ చెప్పేదాన్ని. వినిపించుకొంటేనా? పైగా నా మీద కోపం చూపించేది.

"నే పడే బాధకన్నా నువ్వు నాకేవన్నీ చెప్పి ఎక్కువ బాధని కలిగిస్తున్నావని తలుస్తున్నాను" అని అనేది.

నా కోసం మా నాన్న మనిషిని పంపించాడు. ఇన్ని రోజులు ఎందుకున్నానో అని తెలీక. "వెళతాను" అని మామయ్యతో అన్నాను.

"ఏం చేస్తాం తల్లీ! దాని కర్మ అలా రాసి వుంటే" అని కంట తడిపెట్టుకున్నాడు. ఆ సాయంత్రం బండికి యింటికి వొచ్చాను నేను.

* * *

ఆ పైన నెలరోజులవరకూ సరళ పరిస్థితి తెలీనేలేదు. మా నాన్నకి కాకినాడకు బదిలీ అయింది. మా కుటుంబం అక్కడకు వెళ్ళవలసి వచ్చింది. ఈలోపల ఒకరోజు సరళని చూసి వద్దామని అనుకొన్నాను కాని ప్రయాణంతొందర వల్ల వీలుపడింది కాదు.

కాకినాడ వెళ్ళిన తరువాత ఉత్తరం వ్రాశాను. అప్పుడు మామయ్య తిరుగుటపాలో వ్రాశాడు.

"సరళ పరిస్థితి మరీ దుర్భరంగా వున్నదమ్మా! పెద్ద డాక్టరు దగ్గరికి పట్నం తీసుకెళుతున్నాము. అక్కడ చేరగానే వుత్తరం రాస్తాను" అని.

అక్కడ చేరిన వారంరోజులకు మామయ్య దగ్గర్నుంచి వుత్తరం వొచ్చింది.

"మద్రాసు చేరుకున్నాం తల్లీ. పెద్ద డాక్టరుకు చూపించాం. నయమవుతుందనే ధైర్యం చెప్పాడు. పిల్లకి పూర్తి విశ్రాంతి కావాలన్నాడు. నలుగురితో తిరుగుతూ ఆమాటలూ ఈమాటలూ చెపుతూ వుండాలన్నాడు. గతాన్ని పూర్తిగా మరిచి పోయేట్టు ఆమెకు కొత్తకొత్త వింతల్ని చూపిస్తూ, ఆశ్చర్యకరమైన సంగతుల్ని చెపుతూ వుండాలి అని అన్నాడు. సాధ్యమైనంత వరకూ అలాగే చేస్తున్నాం. మంచి గాలి రావటానికిగాను బీచికి దగ్గరగా ఒక మేడ అద్దెకు తీసుకొని వుంటున్నాము. వీలు పడితే ఒకసారి వొచ్చి చూచిపో."

కాని నాకు వీలు చిక్కనేలేదు మద్రాసు పోవటానికి. కాకినాడ వాతావరణం అలవాటు పడక రాధిగాడికి జబ్బు చేసింది. మూడో రోజు ఉదయాని కల్లా పోతుందనుకొన్నేట్లువుండి నాలుగోరోజునించీ పదో రోజు వరకూ క్రమానుసారంగా పెరిగింది. అమ్మవాళ్లు భయపడ్డారు. డాక్టరుచేత మందిప్పించాము. తరువాత పదిహేను రోజులు ఒకే స్థితిలో నిలబడిపదహారోరోజునుంచి తగ్గుముఖం పట్టి చివరకి నిండుగా నెలరోజులకి తగ్గింది. వాడికి ఈ భూమిమీద నిలిచే రాత వుందని ఆనందపడ్డాం.

మరో నెలరోజుల వరకూ మామయ్య వ్రాస్తున్న వుత్తరాలన్నింటినీ బట్టి సరళ స్థితి కొస్త బాగుపడినట్టు కనిపించుతున్నదనీ, భర్తని రెండు మూడురోజులకె ఒకసారి తలుచుకుంటున్నదనీ తెలిసింది.

సంతోషించాను. కాని ఆ సంతోషాన్ని నిలుపుకోలేక పోయాను. ఇటువంటి జబ్బుల్ని ఎలా నమ్మడం?

(వచ్చే సంచికతో ఆఖరు)